క్లుప్తంగా

తోడేండ్లపల్లెలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చాగలమర్రి: సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో తోడేండ్లపల్లె గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా మలేరియా అధికారి వరప్రసాద్‌రెడ్డితో పాటు ఆళ్లగడ్డ సబ్ యూనిట్ మలేరియ అధికారి శివ చంద్రారెడ్డి, ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి శివమోహన్ హాజరై పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడలని గ్రామస్తులకు వారు సూచించారు. ఎంపీఈఓ సుబ్బరాయుడు, సీహెచ్‌ఓ బ్రహ్మతేజ, ఏఎన్‌ఎంలు రాణి, సుభాషిణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత కర్రసాము శిక్షణ



కర్రసాములో పాల్గొన్న చిన్నారులు

నంద్యాల(న్యూటౌన్): కర్రసాము పిల్లల్లో ధైర్యసాహసాలు పెంపొందిస్తుందని శిక్షకుడు ఆంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్‌బీఐ కాలనీలోని రామాలయంలో చిన్న పిల్లలకు ఉచిత కర్రసాము, కత్తి సాముపై శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అలాగే..సెలవు రోజుల్లో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు హనుమాన్ చాలీసా, ఓంకారం నేర్పిస్తామని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

రుద్రవరం: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండు చేశారు. మండల పరిధిలోని పెద్దకంబలూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. అధికారంలోకి రాగానే పథకాల అమలులో నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి బాలనరసింహులు, అడ్వకేట్ నరసింహులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో కేసులు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని నక్కలదిన్నెకు చెందిన మస్తాన్ కుటుంబ సభ్యులపై కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వర ప్రసాదు సోమవారం తెలిపారు. కొద్ది రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన లింగారెడ్డికి మస్తాన్ కుటుంబ సభ్యులకు బోరు మోటార్ విషయంలో వాగ్వాదం నెలకొంది. ఈ విషయంపై బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోటకొండలో..

మండల పరిధిలోని కోటకొండకు చెందిన విజయ్, చెన్నయ్య, శ్యామలపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వర ప్రసాదు తెలిపారు. విజయ్ అనే నిందితుడు మోటార్ సైకిల్‌తో కాలనీలో శబ్దాలు చేస్తూ అటు ఇటు తిరుగుతుండటంతో కాలనీ వాసి శంకర్ ఇదేమని అడిగినందుకు గొడవ నెలకొంది. దీంతో కాలనీ వాసి శంకర్ కోర్టును ఆశ్రయించడంతో గొడవకు కారణమైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

19న మండల స్థాయి క్రీడాపోటీలు

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలో ఈనెల 19వ మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ అనురాధ, స్కూల్ గేమ్స్ సమన్వయకర్త పీడీ దాదాపీర్ సోమవారం తెలిపారు. అండర్–14, 17 విభాగాలకు చెందిన విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, చెస్, యోగతో పాటు అథ్లెటిక్స్‌లో పోటీలు ఉటాయన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజక వర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ, సివిక్స్ సబ్జెక్ట్‌లను బోధించేందుకు ఆసక్తి ఉన్న నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.మారెన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎం.ఏ(హిస్టరీ)లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందినవారు అర్హులని, ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తులను కళాశా ల లో అందజేయాలన్నారు. వేతనంనెలకురూ.10 వేలు ఉంటుందన్నారు.వివరాలకు సెల్. 9441408498, 9985858587 సంప్రదించాలన్నారు.

మల్లన్నకు సహస్ర దీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవను నిర్వహించింది. ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్ర దీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి వెండిరథంపై ఆశీనుగావించి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

రహదారులపై గుంతలు



తారు లేచిపోయి పూర్తిగా దెబ్బతిన్న బోదెమ్మనూరు రహదారి



గుంతలమయంగా ఉయ్యాలవాడ-దొర్నిపాడు రహదారి దుస్థితి

● ప్రమాదాల బారిన ప్రయాణికులు

ఉయ్యాలవాడ: గ్రామీణరహదారులు శిథిలావస్థకు చేరాయి. వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు తారు కొట్టుకుపోయి రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని భీమునిపాడు ఆర్.జంబులదిన్నె ఆర్‌అండ్‌బీ రహదారిలో పెద్దయమ్మనూరు నుంచి ఆర్.జంబులదిన్నె వరకు, బోడెమ్మనూరు కుందూనది వంతెన నుంచి జమ్మలమడుగు కోవెలకుంట్ల ప్రధాన రహదారి వరకు నిర్మించిన బీటి రహదారి పూర్తిగా దెబ్బతింది. ఉయ్యాలవాడ నుంచి దొర్నిపాడుకు వెళ్లే రహదారి 2016–17లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద 13.25 కిలోమీటర్లు దూరం ఉయ్యాలవాడ నుంచి దొర్నిపాడును కలుపుతూ అప్పట్లో రూ.7.85 కోట్లతో నిర్మించారు. ప్రస్తుతం తారు లేచిపోయి 6 కిలో మీటర్ల పొడువున రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచిన సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులను బాగు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సాగు నీరందక రైతన్నల ఆందోళన

● కుంచించుకు పోతున్న కాల్వ

శిరివెళ్ల: పొలాలలకు సాగునీరు అందించే పంట కాల్వలు ఏడాదికేడాది కుంచించుకుపోతున్నాయి. దీంతో పంటలకు తగినంత సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. కేసీ కెనాల్ శిరివెళ్ల సబ్ చానల్ నుంచి, శిరివెళ్ల మెట్ట నుంచి యర్రగుంట్ల వరకు పంట కాల్వ కుంచించుకుపోయింది. కాల్వ కింద వెంకటాపురం, యర్రగుంట్ల పరిధిలోని 2 వేల ఎకరాలకు నీరు సక్రమంగా అందడంలేదు. దాదాపు 500 మంది రైతులకు సాగు నీరు సమస్య ఏర్పడింది. 2 కిలో మీటర్ వరకు ఉన్న కాల్వ వెంట ఇరుపక్కల ప్లాట్‌ఫారం కోసం కట్టడాలు నిర్మించారు. అలాగే శిరివెళ్ల మెట్ట వద్ద ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన ప్లాట్ కోసం కాల్వకు ఓ చిన్న పాటి సిమెంట్ పైప్ వేసి పైన కాల్వ దాటడానికి రోడ్డు వేశాడు. దీంతో ఆ పైప్‌లోనే నీరు పోవాలంటే కష్టంగా ఉంది. నీరందక తమ పొలాలు ఎండిపోయే స్థితికి వచ్చాయని యర్రగుంట్ల, వెంకటాపురం రైతులు వాపోతున్నారు.



కాల్వకు ఇరువైపులా నిర్మించిన సైడ్ వాల్‌ను చూపుతున్న రైతులు

మురుగును తొలగించండి

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె ఎస్సీ కాలనీ మురుగు మయం అయ్యింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు సీసీ రోడ్డుపైనే నిలిచింది. ఆ నీరు ప్రస్తుతం మురుగుగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. దుర్వాసనకు ఇళ్లలో ఉండలేకపోతున్నామని, అధికారులు స్పందించి మురుగును బయటకు పారదోలేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



కొండమాయపల్లె ఎస్సీ కాలనీలో నిలిచిన మురుగు నీరు

దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం

మహానంది: అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం కార్యాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ కామేశ్వరీదేవి అమ్మవారికి అలంకార పూజలు, వాహనసేవలు, గ్రామోత్సవం సేవలు ఉంటాయన్నారు. రూ.13 వేలు చెల్లించి ఉభయదాతలుగా పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్ధన శర్మ, ఏఈఓలు వై.మధు, ఓంకారం వెంకటేశ్వరుడు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏచూరి పోరాటం స్ఫూర్తిదాయకం

నంద్యాల(న్యూటౌన్): కమ్యూనిస్టు ఉద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించిన ఘనత సీతారాం ఏచూరికి దక్కుతందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసురత్నం అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ఉద్యమానికి అందించిన మద్దతు, సహకారం అమూల్యమైందన్నారు. బీమా సంస్థలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండాలని కోరారన్నారు. సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన మృతి సీపీఎంకు, దేశానికి తీరని లోటన్నారు. తోటమద్దులు, గౌస్, బాలవెంకట్, రామరాజు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్-ఉన్- నబీ వేడుకలు





ప్రవక్త తల నీలాలను నీటితో కడిగి, పూలతో శుభ్ర పరుస్తున్న దృశ్యం,అన్నదానం చేస్తున్న ముస్లింలు

చాగలమర్రి: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మిలాద్ ఉన్న నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నమకానం వీధిలోని జామీయా మసీద్ పక్కన ఆసారే షరీఫ్ (మహమ్మద్ ప్రవక్త తల నీలాలను భద్రపరిచిన గది)లో ప్రవక్త తల నీలాలను సోమవారం సాయంత్ర ప్రదర్శనకు ఉంచారు. అధిక సంఖ్యలో ముస్లింలు హాజరై తిలకించారు. నిర్వాహకులు సయ్యద్ లాలామియ్య షా ఖాద్రీ ముందుగా ప్రవక్త తల నీలాలను పరిశుభ్రమైన నీళ్లలో, పూలతో శుభ్రపరచి ప్రదర్శనకు ఉంచారు. అనంతరం దాత ప్యారేభాయిగారి మాబు షరీఫ్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖాజీ ఖమురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలో మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ కుమారుడు ఫిరోజ్‌పై ఆదివారం రాత్రి దాడికి యత్నించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి.. ఫిరోజ్‌కు పలు మార్లు ఫోన్ చేసి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో భూమా బ్రహ్మానందరెడ్డి బ్యానర్‌ను ఎందుకు తొలగించారని ప్రశ్నించాడు. బ్యానర్లకు సంబంధించిన విషయం తనకు తెలియదని చెప్పినా వినకుండా మొండిగా వాదించటంతో అతని నంబర్‌ను ఫిరోజ్ బ్లాక్ లిస్ట్‌లో ఉంచాడు. రాత్రి రాజ్ థియేటర్ నుంచి ఫిరోజ్ కారులో ఇంటికి వెళ్తుండగా గేట్ దగ్గర వెంకటేశ్వరరెడ్డి అటకాయించి కారు అద్దంపై గుద్దటంతో ఫిరోజ్ కారులోంచి దిగాడు. దీంతో వెంటనే ఫిరోజ్‌పై దాడికి యత్నించగా.. అక్కడే ఉన్న టీడీపీ వర్గీయులు వెంకటేశ్వరరెడ్డికి దేహశుద్ది చేసి పోలీసులకు అప్పగించారు. ఫిరోజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని మృతి

బేతంచెర్ల: ఎక్కువ సేపు ఫోన్‌లో మాట్లాడుతోందని కళాశాల యాజమన్యం మందలించడంతో ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని ఆరోగ్యం విషమించడంతో సోమవారం మృతిచెందింది. ఏఎస్‌ఐ లింగమయ్య వివరాల మేరకు.. బేతంచెర్ల సిమెంట్ నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా, ఫాతిమా కుమార్తె షేక్ రుక్సానా(19) వైఎస్సార్ జిల్లాలోని అయ్యవారు రెడ్డి కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కళాశాలలో ఎక్కువ సేపు ఫోన్ వినియోగిస్తుండడంతో యాజమాన్యం మందలించింది. నెల పాటు కళాశాల నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ఇంటికి వచ్చిన షేక్ రుక్సానా మనస్తాపానికి గురై ఈనెల 13వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలకు పూసుకునే సూపర్ వాస్మోలిన్ తాగింది. అప స్మారక స్థితిలో పడివున్న ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే ఆరోగ్యం విషమించడంతో మృతి చెందింది. మృతురాలి తల్లి ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు.



షేక్ రుక్సానా మృతదేహం

చీటింగ్ కేసులో వ్యక్తి అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల శ్రీనివాస హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు భరత్‌కుమార్‌ను చీటింగ్ కేసులో అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ ఇస్మాయిల్ సోమవారం తెలిపారు. తప్పుడు పత్రాలతో ఒకరి పేరు మీద ఉన్న సొసైటీ స్థలాన్ని మరొకరి పేరుతో రిజిస్టర్ చేశాడన్నారు. ఈ క్రమంలో 2023లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని, ఈ నేపథ్యంలో భరత్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు.

22న ఏపీటీఎఫ్ మహాసభ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 22వ తేదీన ఏపీటీఎఫ్ జిల్లా విద్యావైజ్ఞానిక మహాసభను విజయవంతం చేసుందుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ పెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం పట్టణంలోని న్యాయశాఖ మంత్రి ఫరూక్‌ను కలిసి మహాసభకు ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శివకుమార్, రవికుమార్, నాయకులు రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఉయ్యాలవాడ: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి తెలిపిన వివరాలు.. సోమవారం మండల పరిధిలోని కోవెలకుంట్ల, జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్లకు రాయల్టీ లేకుండా తరలివెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను అల్లూరు గ్రామ సమీపంలోని గంగమ్మ గుడి వద్ద సీజ్ చేశారు. డ్రైవర్ సుధాకర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ దుర్మార్గం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ వైద్య విద్యను చదవాలనుకునే విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం ధ్వంసం చేస్తుందని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల రద్దు హామీ ఏమైందని, మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణకు కట్టబెట్టడం దుర్మార్గమని ఎస్‌ఎఫ్‌ఐ నంద్యాల జిల్లా కార్యదర్శి నాయక్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఆక్షేపించారు. సోమవారం పట్టణంలో ఆయా సంఘాల కార్యాలయాల్లో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ కేంద్రంతో సంప్రదించి 5 కళాశాలలకు అనుమతులు తీసుకురావాల్సిన ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని ఎన్‌ఎంసీకి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 700 సీట్లు కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు.పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు షాహిద్, సహాయ కార్యదర్శి బాలాజీ, హరి, సురేష్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హుసేన్, రఫీ పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

రుద్రవరం: మండల పరిధిలోని హరినగరానికి చెందిన సారా విక్రేత రాజును అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాదు సోమవారం తెలిపారు. కొద్ది రోజులుగా సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా వేశామన్నారు. 5 లీటర్ల నాటుసారాతో నిందితుడు పట్టుబడటంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బవనాసి వాగుపై వంతెన నిర్మించాలి

ఆత్మకూరు: ఆత్మకూరు నుంచి కొత్తపల్లి మండలానికి వెళ్లే దారిలో బవనాసి వాగుపై వంతెన నిర్మించాలని సామాజిక కార్యకర్త జవహర్‌నాయక్ సోమవారం అధికారులను కోరారు. భారీ వర్షాలకు నీటి ప్రవాహం అధికమై కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల ప్రజలు, కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లెకు చెందిన బాలనరసింహ్ముడు సోమవారం ఇంట్లో ఉన్న వాజ్‌మల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడివున్న అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సమస్యల కారణంగా ఆత్మ హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ సక్రమంగా అందజేయాలి

నంద్యాల(అర్బన్): రేషన్ సరుకులు పేదలకు అందని ద్రాక్షలా మారాయని, పేదలు రేషన్ ఎక్కడ తెచ్చుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ అందించేవారన్నారు. ప్రస్తుతం వాహనాలు ఇళ్ల వద్దకు సరైన సమయంలో రాకపోవడం రేషన్ ఎక్కడ తెచ్చుకోవాలో తెలియక కార్డుదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. పట్టణ శివారుప్రాంతం నందమూరి నగర్ ప్రజలు రేషన్ కోసం డీలర్ షాపుల వద్దకు వెళ్తుంటే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని మండిపడ్డారు.

రూ. 1.50 లక్షల విరాళం అందజేత

నంద్యాల(అర్బన్): విజయవాడ వరద బాధితుల సహాయార్థం నంద్యాల జిల్లా ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఫరూక్‌కు రూ.1.50 లక్షలు చెక్కు అందజేశారు. అసోసియేషన్ నాయకులు కాల్వ విజయశేఖర్, శరత్‌కుమార్ మాట్లాడుతూ వరద బాధితులను ఆదునేందుకు తమవంతు సాయంగా సీఎం రిలీఫ్ ఫండుకు చెక్కు పంపుతున్నామన్నారు.

నిత్యావసర సరుకుల విరాళం..

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాఘవేంద్ర విద్యాసంస్థల ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు షేక్షావలిరెడ్డి, మౌలాలిరెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కుటుంబానికి 10 కిలోల బియ్యం చొప్పున వెయ్యి కుటుంబాలకు తమ పాఠశాల సిబ్బంది పంపిణీ చేస్తారని చెప్పారు. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.50 లక్షల నగదు అందజేయనున్నట్లు తెలిపారు. రామకృష్ణారెడ్డి, రవికృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిదులు పాల్గొన్నారు.



సరుకులను లారీలో తరలిస్తున్న దృశ్యం

మహానందీశుడి దంపతులకు కల్యాణం



మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం నిత్య కల్యాణోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. ఈశ్వరుడికి సోమవారం ప్రీతికరమైన వారం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సాధారణ, ఉచిత, శీఘ్రదర్శనం క్యూలైన్లు, మహామంగళ హారతుల సేవా సమయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మల్లన్న సేవలో బాంబే హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినయ్ జోషి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం సాయంత్రం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన బాంబే హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో బాంబే హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.



బాంబే హైకోర్టు న్యాయమూర్తి దంపతులను సత్కరిస్తున్న ఈఓ

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

● ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమర్రి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల విజృంభిస్తున్న తోడేండ్లపల్లె, మల్లెవేముల గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేయిస్తామని ప్రజలకు సూచించారు. ఆరోగ్యం బాగోలేకుంటే వెంటనే వైద్య సిబ్బంది కలిసి చికిత్స చేయించుకోవాలన్నారు. ఆమె వెంట జిల్లా మలేరియా అధికారి వరప్రసాద్‌రెడ్డి, ఆళ్లగడ్డ సబ్ యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి, వైద్యాధికారి శివమోహన్, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓడీఆర్‌డీ షేక్ తాహీర్ హుసేన్, పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ, ప్రదీప్, లీలావతి ఉన్నారు.



తోడేండ్లపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

నీట్‌లో మెరిసిన రైతు బిడ్డ

దొర్నిపాడు: ఓ రైతు బిడ్డ నీట్‌లో మెరిశాడు. క్రిష్టిపాడు గ్రామానికి చెందిన రైతు సంగపట్నం అబ్దుల్, ఫరీదాబీ కుమారుడు అన్వర్ నీట్‌లో 3,200 ర్యాంక్ సాధించి నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందాడు. తనకున్న మూడెకరాలతో పాటు మరికొంత కౌలుకు తీసుకొని అబ్దుల్ తన ఇద్దరు కుమారులను చదివిస్తున్నాడు. చిన్న కుమారుడు జాహిద్ పులివెందులలో పాలిటెక్నిక్ చదువుతుండగా పెద్ద కుమారుడు అన్వర్ మెడిసిన్ సీట్ కైవసం చేసుకోవడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ×మా నాన్న ప్రోత్సాహంతోనే సీటు సాధించాను` అని అన్వర్ తెలిపారు.



తల్లిదండ్రులు అబ్దుల్, ఫరీదాతో అన్వర్



పాడిగేదెలను వంతెనపై తీసుకెళ్తున్న దృశ్యం

● ప్రమాదపుటంచున..

ఇటీవల కూందునదిలో వరదనీరు తగ్గడంతో క్రిష్టిపాడు గ్రామంలో నదిపై నిర్మించిన వంతెనపై పలువురు ప్రమాదపుటంచున రాకపోకలు సాగిస్తున్నారు. 10 అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. తప్పని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నామని, అధికారులే స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– దొర్నిపాడు